
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 68 వ భాగం

### అజామీళోపాఖ్యానం – 2

### అజామీళుడి జీవితం

ఇంతవరకూ పాప పుణ్యాలు ఎలా విడివిడిగా లెక్కించబడతాయో, ఒక కర్మ చేత మరొకటి కడిగేసుకోవడం ఎందుకు, ఎలా కుదరదో చెప్పాడు శుకమహర్షి. అయితే భక్తియోగం వల్ల – కేవలం ముకుందుణ్ణి నిరంతరం మనసులో ఉంచుకోవడం వల్లే ముక్తి సులభం అనీ, అటువంటిది విశదీకరించడానికి ఒక ఇతిహాసం ఉందనీ చెప్పాక ఆ కథ మొదలుపెడుతున్నాడు శుక మహర్షి పరీక్షిత్తు వినడానికి.

సీ. నరనాథ! వినుము కన్యాకుబ్జపురమునఁ;
గలఁడు బ్రాహ్మణుఁ డజామిళుఁ డనంగఁ
బాతకుం డతుల నిర్భాగ్యుం డవజ్ఞుండు;
నష్టసదాచారి కష్టరతుఁడు
జూదంబులందు దుర్వాదంబు లందును;
జౌర్యంబునందు మచ్చరము గలిగి
తొత్తాత్మ పత్నిగా మత్తుఁడై వరియించి;
కొడుకులఁ బదుగురఁ బడసి చాల [6-60]

ఆ. మోహజలధిలోన మునిఁగి ముచ్చట దీఱ
బాల లాలనాది లీలఁ దగిలి
పెద్దకాల మతఁడు పెంపార సుఖియించి
ఫలిత మెల్ల వదిలి పతితుఁడయ్యె. [6-60.1]

కన్యాకుబ్జంలో ఉన్న బ్రాహ్మణుడు అజామీళుడు అజ్ఞుడు, పాతకుడు, నిర్భాగ్యుడు. జూదం ఆడడం, అనే దుర్వ్యసనాలతో, పెళ్ళి చేసుకున్న దాసీతో (తొత్తు+ఆత్మ) కాలం గడపడంతో పదిమంది పిల్లలు పుట్టుకొచ్చారు. చాలాకాలం ఇలా గడిచాక వయసు మీద పడింది. అసలు అజామీళుడు ఎవర్ని పెళ్ళి చేసుకున్నాడనేది పక్కన పెడితే, ఆయన జీవితంలో జరిగేది దాదాపు మనందరి జీవితంలో జరిగేదే కదా? మొదట్లో యవ్వనం, చదువు, తర్వాత పెళ్ళి, పిల్లలూ, వాళ్ల గురించి చింత, ఏదో ఒకసారి దేవుణ్ణి స్మరించుకోవడం, మనకి ఏదైనా కష్టం దాపురిస్తే 'ఇదంతా నాకు దేవుడు కావాలని పనిగట్టుకుని చేసాడు' అని వేదన. శరీరం పట్టుతప్పుతుంటే, ఇప్పటివరకూ మనసులో మెదలని దేవుడు అప్పుడు మాత్రం ఎలా గుర్తుకొస్తాడు? అందుకే నిరంతరం –

సర్వకాల సర్వావ్యవస్థల్లోనూ భగవంతుణ్ణి చిన్నప్పటినుండి గుర్తుపెట్టుకుంటే, చివరి సమయంలో గుర్తుకు వచ్చే అవకాశం ఉంది. కానీ మనకి దేనికీ సమయం కుదరదు కదా, భగవంతుణ్ణి స్మరించుకోవడానిక్కానీ మిగతావాటిక్కానీ; అసలే సవా లక్ష పనులున్నాయే? అదే జరుగుతోంది అజామీళుడికి. ఓ విధంగా చూస్తే మనందరం కూడా ఒక్కొక్క అజామీళులమే.

సీ. నిర్మలం బనఁ జాలనెఱయు చిత్తం బన;
నల్లని వెం(డ్రుకల్ తెల్లనయ్యెఁ;
దగు మోహపాశ బంధంబు జాఱినమాడ్కిఁ;
బొదలిన యంగముల్ వదలి వ్రేలె;
నింద్రియంబుల కోర్కులిఁక నొల్ల నను భంగి;
నుడుగక తల చాల వడఁక జొచ్చెఁ;
దమకంబు ప్రాయంబుఁ దగిలిపోయిన మాడ్కి;
లోచనంబుల చూడ్కి నీచమయ్యెఁ; [6-61]

ఆ. వగరు పుట్టె; నంతఁ బొగలె దంతంబులు;
నుక్కిసయును దగ్గుఁ బిక్కటిల్లె;
శిరసు నొవ్వఁ దొడఁగెఁ; జెదరె మనం; బంతఁ
గడిఁది యైన ముప్పు కాలమునకు. [6-61.1]

యవ్వనంలో నల్లగా ఉన్న తల తెల్లబడింది – కుళ్ళిపోయిన మనస్సు ఏదో ఒకనాటికి నిర్మలం అవుతుందన్నట్టుగా. మోహపాశాలు వదిలాక అవయవాలు పట్లు తప్పాయి. ఇంద్రియాలు ఇంక కోర్కెలు చాలు అన్నట్టు తల వణుకుతోంది. కంటిచూపు మందగించింది. ఆకలి లేదు, తినడానికి దంతాలు ఊడాయి. వదలని ఆయాసం, దగ్గు. చివరి క్షణాలకోసం ఎదురుచూపు మొదలైంది. కానీ సంసారం అంత తొందరగా వదుల్తుందా?

ఆ. ఎనయ నతని కెనుబ దెనిమిది వర్షంబు
లంత నరుగుటయును భ్రాంతుఁ డగుచుఁ
గోరి పిన్నకొడుకు నారాయణాఖ్యుండు
బాలుఁ డగుట మిగుల భక్తిఁ జేసి. [6-62]

అజామీళుడికి ఎనిమిదేళ్ళ ఆఖరికొడుకు – నారాయణుడనేవాడి – మీద వాత్సల్యం. ఇంతటి వయసులో కూడా ఇన్ని వ్యసనాలు ఉన్నా చేసిన పనులకి పశ్చాత్తాపం ఉందా అంటే లేదనే సమాధానం వస్తోంది. కొడుకుమీద, సంసారం మీద ఇంకా వ్యామోహం పోవట్లేదు. ఈ కుఱ్ఱాడి మీద మరింత ప్రేమ.

క. అత్యంత పాన భోజన
కృత్యంబులఁ బొత్తు గలిగి క్రీడలఁ దత్సాం
గత్యంబు వదల కాగత

మృత్యువుఁ గన నేరఁ డయ్యె మిక్కిలి జడుఁడై. [6-65]

భోజనం చేయడానికో, మరోదానికో ప్రతీ చర్యనీ ఆ కుర్రాడితో కల్పి ఆనందించడం అలవాటయి, రాబోయే మృత్యువుని గమనించడం మర్చిపోయాడు; ఎందుకంటే, మిక్కిలి జడత్వం వల్ల.

తే. తెలియ కీ రీతి నతఁడు వర్తించుచుండ
భయద మగు మృత్యుకాలంబు ప్రాప్తమైన
భూరి వాత్సల్యవృత్తి న పుత్రుఁ దలఁచి
యాత్మఁ బ్రలపించె నారాయణా యటంచు. [6-66]

ఇలా రోజులు గడుస్తుంటే ముప్పున కాలకింకరులు ముంగిట్లోకి వచ్చారు. అజామీళుడికి భయం తాను చచ్చిపోతానేమోనని; ఇంకా కుర్రాడి మీద వ్యామోహం పోలేదు కదా, దానితో వాణ్ణి తలుచుకుంటూ పోయేటపుడు 'నారాయణా' అని కలవరిస్తూ పోయాడు.

ఓ సారి వెనక వ్యాసాల్లో చదివినది గుర్తు తెచ్చుకుందాం – కంచెర్ల గోపన్న చెప్పిన పద్యం – ముప్పున కాలకింకరులు ముంగిట వచ్చినవేళ... అనేదాని గురించి. యమకింకరలు వచ్చినప్పుడు మనం ఎక్కడ ఏ స్థితిలో ఉంటాం? అప్పుడు గొంతులో శ్లేష్మం అడ్డంపడకుండా రాముడు గుర్తొస్తాడా? బంధువులు చుట్టూ ఉంటే వాళ్ళేం చేస్తారు? మనిషి ప్రాణం పోయేటపుడు ఎలా ఉంటాడు, ఏమౌతుంది అనే ఉత్సుకతతో వాళ్ళు చూస్తున్నారా లేకపోతే నిజంగా ఏదో ప్రేమతో చూస్తున్నారా? వాళ్ళు మనకూడా వచ్చేవాళ్ళేనా? ఆ స్థితిలో మనం నిజంగా చూద్దామని అన్నుకున్నవారు కనిపిస్తున్నారా లేకపోతే ఎవరున్నారు మనకూడా? ఇటువంటి పరిస్థితుల్లో మనకి భగవంతుడు గుర్తురావాలంటే మనం జీవితంలో ఎంత సాధన చేసి ఉండాలి? జీవితంలో ఏనాడూ భగవంతుణ్ణి నమ్మని మనకి, ఏదైనా చెడు జరిగితే దానికి 'భగవంతుడు నాకు కావాలని ఇలా చేసాడు' అని ఢంకా భజాయించి మరీ చెప్పిన మనకి, "నేను నాస్తికుణ్ణి మొదట్లో కానీ తర్వాత ఆస్తికుడిగా అయ్యేను," లాంటి రకరకాల కథలు చెప్పిన మనకి, పూర్తిగా పీకలోతు సంసారంలో మునిగిన మనకి భగవంతుడు ఎలా గుర్తుకొస్తాడు? పోనీ జీవితాంతం సాధన చేసినా చివరి క్షణంలో గుర్తుకొచ్చే అవకాశం ఉందా? దీనికో చిన్న ఉదాహరణ.

శ్రీరామకృష్ణులు అనడం ప్రకారం మీరు ఓ చిలకని తీసుకొచ్చి 'రామ రామ' అనడం నేర్పించారు. అది ఎవరొచ్చినా కనబడినా, రామ రామ అంటోంది. ఓ రోజు ఎందుకో ఆ రెక్కలు కత్తిరించిన చిలకని పంజరంలోంచి వదిలారు. దగ్గర్లో ఉన్న పిల్లి ఒకటి చిలకని చంపి తినడానికి తయారైంది. అప్పుడు చిలక 'కేర్ కేర్' మని చుట్టూ పరుగుపెట్టింది. అగండాగండి, అదేమిటండి, మీరు చిలకకి 'రామ, రామ' అనడం కదా నేర్పించింది? మరి ఇప్పుడు 'కేర్, కేర్' అంటోందేమిటి? మృత్యువు దగ్గిరకొస్తే ఏం జరుగుతుందనేదానికి అదీ ప్రత్యక్ష దృష్టాంతం.

క. కింకరుల ధర్మరాజ వ
శంకరుల దురంత దురిత సమధిక జన నా
శంకరుల సకలలోక భ
యంకరులం గనియె నింద్రియాకులుఁ డగుచున్. [6-68]

ఈ స్థితిలో మనసు, ఇంద్రియాలు అల్లకల్లోలమవుతుంటే, జనాలందరినీ నాశనం చేసేవారూ, భయంకరమైనవారూ, ధర్మరాజు వశంకురులైన యమకింకరులని చూసాడు.  సింగయ కూడా పోతనలాగే పద్యాలు రాయడం గమనించారా? కింకరుల, వశంకరుల, నాశంకరుల, భయంకరుల అంటూ. పోతనకి తగిన శిష్యుడే.

క.  ఘాతుకుల దండ దండిత
పాతకుల మహోగ్ర కర్మ భర నిష్కరుణా
జాతకులఁ బ్రేతనాయక
దూతక సంతతుల నతఁడు దూరమునందున్.  [6-69]

వీడు మావాడు, వాడు మావాడు కాదు అనే తారతమ్యాలు లేని వాళ్ళైన యమకింకరులని అజామీళుడు చూశాడు. ఆ యమకింకరులు, పాపులని దండించేవాళ్ళు, మనం చేసిన మహోగ్రమైన కర్మలకి కరుణ అనేది లేకుండా శిక్ష వేయగలవారు, ప్రేతనాయకులు.  ఎవరెన్ని పుణ్యకార్యాలు చేసినా, పాపం చేసినా వాటికి శిక్ష అనుభవించవలసిందే కనక ఆ యమకింకరులకి ఎటువంటి దయాదాక్షిణ్యాలు ఉండవు. ఎందుకుండాలి? మనం జీవితాంతం చేసిన తప్పులకి, ఏనాడూ పశ్చాత్తాపం పొందని తప్పులకి చివరి క్షణంలో 'కాస్త దయ చూడండి,' అని ఓ సారి అడగ్గానే ఎందుకు వదలాలి ఎవరినైనా? బతికి ఉన్నప్పుడైతే మనం ఎవరికో ఒకరికి ఇష్టులం, వాళ్లు మన మీద దయ చూపిస్తారేమో. మరి యముడో? ఆయనెవరికీ ఇష్టుడూ కాదు, మిత్రుడూ కాదు. దీని గురించే వామనావతారంలో ఓ సారి చూసాం. బలి "చెలియే మృత్యువు? చుట్టమే యముడు? సంసేవార్ధులే కింకరుల్? ..." అంటూ వామనుడితో చెప్పడం.

మ.  కనియెన్ బ్రాహ్మణుఁ డంత్యకాలమున వీఁకన్ రోషనిష్ఠ్యూతులన్
ఘనపీనోష్ఠ వికారవక్త్ర విలసద్గర్వేక్షణోపేతులన్
జన సంత్రాస కరోద్యతాయత సుపాశశ్రేణికా హేతులన్
హననవ్యాప్తి విభీతులన్ మువుర నాత్మానేతలన్ దూతలన్.  [6-70]

వ. ఇట్లతి వికృత తుండ గండాభోగ విభాగ విషమ వివృత్త నేత్రులు, నతి పుష్ట నిష్ఠుర తనుయష్ఠి సంవేష్ఠిత మహోర్ధ్వరోములు, నభ్యస్త సమస్త జీవాపహరణ కరణ ప్రశస్త హస్త విన్యస్త పాశధారులు నగు యమభటుల మువ్వురం గనుంగొని యజామిళుండు వికలేంద్రియుండును, వికంపిత ప్రాణుండును, వికృత లోచనుండును, విహ్వలాత్మకుండునై.

[6-71]

ఇలా ప్రాణంపోతున్న అజామీళుడు, వికార మొహాలతో, కాలం సమీపించగానే ప్రాణంతీసే యమభటులు ముగ్గుర్ని చూసాడు.  ఆ స్థితిలో అతనికి ఇంద్రియాలు ఛిన్నాభిన్నం అయిపోయాయి, ప్రాణం పోతోందనే భయంతో, ప్రాణాలని లాగగల కాలపాశాలు (కరణ = చేసే కార్యంలో, ప్రశస్త = ప్రసిద్ధి/అనుభవం ఉన్న, హస్త = చేతులలో, విన్యస్త = కదులుతున్న, పాశధారులు) చేతిలో ఉన్న ఆ ముగ్గురూ కనిపించారు. ఈ యమ భటులు ఎలా ఉంటారనేది, ఎలా కనిపిస్తారనేది మన మనఃస్థితి బట్టి ఉంటుందనేది నిజం అంటారు కొంతమంది.  మరి కొందరి ప్రకారం అసలు నరకం అనేది ఎవరికి వారిదే సృష్టించబడుతుందనీ, వాళ్ల కర్మలు, శిక్షా తీరిపోగానే వారికోసం మాత్రమే సృష్టించబడిన ఆ నరకం మాయం అవుతుందంటారు. లేకపోతే ప్రతీరోజూ చేరుకునే పాపులతో నరకం అనేది నిరంతరం రగులుతూ ఉండడం అసంభవం అనేది వారి వాదన.   దీని గురించి మరి కొంత వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS